
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 11 । జూలై । 2024



అంగన్‌వాడీలకూ 'విరమణ'!
65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్‌మెంట్ అమలుకు ప్రభుత్వం నిర్ణయించగా, జిల్లాలో 166 మందిని గుర్తించారు. 8లో



ఈ జింకలను ఏం చేద్దాం?!
కిన్నెరసాని డీర్ పార్క్‌లో పరిమితికి మించి జింకలు ఉండగా వాటిని సంరక్షించడం ఎలా అని అధికారులు ఆందోళన చెందుతున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
33°/ 25°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్



విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కాలేజీలో మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో దఫా బుధవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌ను గురుకులాల ఆర్‌సీఓ టి.వెంకటేశ్వరరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇంటర్‌మొదటి సంవత్సరం బాలికల్లో 127 సీట్లకు 81, బాలురలో 386సీట్లకు గాను 46 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు హరిసింగ్, జానునాయక్, హరికృష్ణ, పద్మావతి, ఎం.దేవదాసు, రాణి, ఉమాచౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్



జూలూరుపాడు పీహెచ్‌సీలో వైద్య సేవలను పరిశీలిస్తున్న భాస్కర్‌నాయక్

జూలూరుపాడు/అన్నపురెడ్డిపల్లి : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎల్.భాస్కర్‌నాయక్ డాక్టర్లు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట పీహెచ్‌సీలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీల పరిసరాలు, రికార్డులను పరిశీలించాక ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి లోపల, బయట నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ చైతన్య, పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రియాంక, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తుల ఎంపిక 19కి వాయిదా

భద్రాచలం: గిరిజనులు తయారుచేసే ఉత్పత్తుల అమ్మకానికి భద్రాచలంలో గురువారం చేపట్టాల్సిన ఎంపికను వాయిదా వేసినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. హస్త కళారూపాలు, అటవీ, చేనేత ఉత్పత్తులకు ట్రైఫెడ్ ద్వారా వెంటనే చెల్లింపులు జరిపి దేశవ్యాప్తంగా 120 కేంద్రాల్లో అమ్మాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. వీటి ఎంపికకు గురువారం సమావేశం నిర్వహించాల్సి ఉన్నా 19వ తేదీకి వాయిదా వేశామని తెలిపారు. కాగా, ఉత్పత్తిదారులు నమూనాలు, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని సూచించారు. అయితే, 50 కి.మీ. దూరం నుంచి వచ్చే వారికి రవాణా ఖర్చుగా రూ.350 చొప్పున, అంతకంటే దూరం నుంచి వస్తే రూ.500తో పాటు భోజన వసతి కల్పిస్తామని పీఓ తెలిపారు.

రైతులదే తుది నిర్ణయం..

- ప్రభుత్వం మాట కాదు.. ప్రజాభిప్రాయానికే విలువ
- పెట్టుబడి సాయంపై చిత్తశుద్ధితో ఉన్నాం
- అభిప్రాయ సేకరణ కోసం మీ ముందుకే వచ్చాం
- అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాక రైతుభరోసా అమలు
- రైతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, కలెక్టర్లు పాటిల్, ముజమ్మిల్‌ఖాన్, డీఏఓ విజయనిర్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రైతులతో పూర్తి స్థాయిలో చర్చించాకే రైతు భరోసాపై తుది నిర్ణయం తీసుకుంటామని, వారి అభిప్రాయాలను అసెంబ్లీలో చర్చించి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. రైతు భరోసాపై రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల అభిప్రాయాల సేకరణకు కేబినెట్ సబ్ కమిటీ బుధవారం మొదటి సారిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించింది. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడగా.. రైతులు, రైతు సంఘాల నేతలు, డాక్టర్లు, న్యాయవాదులు, రాజకీయ పార్టీల నేతలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ఏకకాలంలో నిర్వహిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ఎక్కువ మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం.. దేశ ఆర్థిక పరిస్థితి, ప్రజల జీవనభృతికి ఉపయోగపడుతున్న రైతుల కోసం రైతు భరోసా ఇస్తామన్న హామీ అమలుకు దృఢసంకల్పంతో ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యాన రైతుభరోసాపై నియమించిన కేబినెట్ సబ్ కమిటీలో తనతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉన్నారని వివరించారు. ఈ కమిటీ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు, ప్రముఖులతో మాట్లాడి విధివిధానాలను రూపొందించేలా అన్ని ఉమ్మడి జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామని, మొదటి సమావేశం ఖమ్మంలో ఏర్పాటుచేశామని భట్టి తెలిపారు. అందరి ఆలోచనలు సేకరించి వాటికి అనుగుణంగా నివేదిక తయారు చేయడంతో పాటు శాసనసభలో చర్చించి రైతు భరోసా అమలు చేస్తామని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు వ్యవసాయంతోపాటు ఆలోచనల్లో ప్రగతిశీల భావనలు కలిగి ఉండి తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పడం అభినందనీయమని అన్నారు.

- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతీ రూపాయి సద్వినియోగమయ్యేలా, పథకాలు అర్హులకు అందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతు భరోసాపై గత ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తే తాము మాత్రం క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని చెప్పారు. అన్ని జిల్లాల్లో రైతుల నుంచి వచ్చే సూచనలు, సలహాల మేరకే విధివిధానాలు, అమలు ఉంటాయని తెలిపారు.
- రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు భరోసా ఎలా అమలుచేస్తే సన్న, చిన్నకారు రైతులకు మేలు జరుగుతుందో అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుదిరూపు ఇస్తామని చెప్పారు. త్వరలోనే 300 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు ఏర్పాటు చేస్తామని ఓ రైతు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, మాలోతు రాందాస్ నాయక్, జారే ఆదినారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వ్యవసాయాధికారులు విజయనిర్మల, బాబూరావు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, నాయకులు, రైతులు

వ్యవసాయానికి భరోసా ఇచ్చేలా ఉండాలి



రైతుభరోసా అమలుపై అభిప్రాయ సేకరణను స్వాగతిస్తున్నాం. గత ప్రభుత్వం రైతు బంధు మాత్రమే సర్వరోగ నివారిణి అన్నట్లు వ్యవహరించి మిగతా పథకాలను ఎత్తేసింది. రియల్ ఎస్టేట్ వెంచర్ల భూములకూ రైతుబంధు ఇచ్చింది. అలా కాకుండా ఇప్పుడు అర్హులకే దక్కాలి. వైఎస్.రాజశేఖరరెడ్డి మాదిరి కౌలు రైతులనూ గుర్తించాలి.

– బాగం హేమంతరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు

పదెకరాల వరకు సాయం ఇవ్వాలి..



వ్యవసాయం చేసే రైతులకు పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి. పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా కార్డు ఉంటేనే రైతు భరోసా ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. అలాంటి నిబంధన పెట్టొద్దు. 2011 చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించడంతో పాటు వారికి రైతుభరోసా లేదా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలి.

– నర్సింహారావు, రైతు

కౌలు రైతులనూ గుర్తించండి..



కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక ఇబ్బంది పడుతున్నారు. వీరికి సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు ఇవ్వడమే కాకుండా యంత్రలక్ష్మి కింద ట్రాక్టర్లు, పరికరాలు అందించాలి. వరి సన్న రకాలకే కాక సాగు చేసే పంటలన్నింటికీ బోనస్ ఇవ్వాలి. తద్వారా కౌలుదారులను కాస్తయినా ఆదుకున్నట్లవుతుంది.

– రామారావు, పుల్లయ్యబంజర, కల్లూరు మండలం

కొండలు, గుట్టలకు వద్దు..



ఇన్నాళ్లు కొండలు, గుట్టలు, కమర్షియల్ భూములకూ రైతు బంధు ఇచ్చారు. ఇప్పుడు సాగు చేసే రైతులకే అందించాలి. సన్న, చిన్నకారు రైతులను ఆదుకునేలా విధివిధానాలు ఉండాలి. భూసార పరీక్షల నివేదికలను అధికారులు ప్రభుత్వానికి పంపుతున్నారు. ఆ నివేదికల ఆధారంగా ఎరువులను ప్రభుత్వమే పంపిణీ చేయాలి.

– నాగిరెడ్డి, లక్ష్మీపురం, ఎర్రుపాలెం మండలం

ప్రభుత్వ ఉద్యోగులను తొలగించాలి..



భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా గతంలో రైతుబంధు అందుకున్నారు. ఇకపై వారికి రైతుభరోసా ఇవ్వొద్దు. సన్న, చిన్నకారు రైతులను మాత్రమే ఆదుకోవాలి. కౌలు రైతులకు ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందజేయాలి. సాగు చేస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించి రైతుభరోసా పంపిణీ చేస్తే మంచిది.

– మందేపల్లి నాగమణి, ఎం.వీ.పాలెం

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



ఆలయంలో దేవాదాయ శాఖ కమిషనర్, తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పనుల్లో ఇళ్ల స్థలాలను కోల్పోతున్న వారు సహకరించాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కోరారు. బుధవారం ఆయన భద్రాచలంలో రంగనాయకుల గుట్టపై ఉన్న దేవస్థానం కాటేజీల్లో ఆలయ, రెవెన్యూ అధికారులు, అర్చకులు, ఇళ్లు కోల్పోతున్న యజమానులతో సమావేశమయ్యారు. మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులకు సేకరించాల్సిన స్థలం, దేవస్థానానికి ఉన్న భూములు, ఇతర వివరాలపై అధికారులతో చర్చించినట్లు సమాచారం. ఇళ్ల స్థలాల యజమానులతో సైతం మాట్లాడి నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్లకుండా సహకరించాలని కోరినట్లు తెలుస్తోంది. కాగా ఈ వివరాలను దేవస్థానం వారు అధికారికంగా వెల్లడించలేదు. కాగా, గురువారం కలెక్టర్‌తో రామాలయం, పురుషోత్తపట్నంలోని ఆలయ భూముల్లో పర్యటించి, వివరాలు తెలిపే అవకాశం ఉంది.

రామయ్య సన్నిధిలో కమిషనర్..
శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. అర్చకులు, ఈఓ రమాదేవి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేశారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం చేసి, ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత కమిషనర్ మాట్లాడుతూ.. దేవస్థాన అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ దామోదర్‌రావు, ఆలయ ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున పర్యాటకులు



లైఫ్ జాకెట్లు లేకుండానే బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం పట్టణానికి తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా గోదావరిలో బోటు షికారు చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తారు. అయితే బోట్ల నిర్వాహకులు పర్యాటకులకు భద్రతాపరమైన సదుపాయాలు కల్పించడం లేదు. టెండర్ నిబంధనల ప్రకారం ఒక బోట్‌లో 15 మందిని మాత్రమే తరలించాల్సి ఉండగా, సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఒక్కోసారి 30 మందిని కూడా తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక బోటింగ్ చేసేవారికి లైఫ్ జాకెట్లు ఇవ్వాల్సి ఉండగా ఏ ఒక్కరికీ అందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు బోట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా భద్రతా పరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సింగరేణిలో పలువురు వైద్యుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న తొమ్మిది మంది వైద్యులను బదిలీ చేశారు. ఈమేరకు బుధవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో జిల్లాకు సంబంధించి బదిలీ అయిన, నూతనంగా రానున్న వైద్యుల వివరాలిలా ఉన్నాయి.. బెల్లంపెల్లి ఏరియా ఆస్పత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డి.లలితను కొత్తగూడెం ఆస్పత్రికి, కొత్తగూడెం ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ జీ.వీ.నర్సింహారావును ఇల్లెందు ఏరియా ఆస్పత్రికి, మణుగూరు ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బీఎస్‌కే.సులోచన బెనర్జీని మందమర్రి కేకే–1 ఆస్పత్రికి, కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ భూక్యా జీయత్‌రామ్‌ను కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రికి బదిలీ చేశారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పాత కొత్తగూడెంలోని విద్యాశాఖ శిక్షణ మందిరంలో బుధవారం ఆయన జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించడం ద్వారా సమర్థవంతమైన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో తక్కువ ఖర్చుతో సకల సదుపాయాలను ఎలా కల్పించవచ్చనే అంశాలను వివరించారు. వనమహోత్సవంలో భాగంగా పాఠశాలల్లో చింత, ఉసిరి, వెలగ, కరివేపాకు, మునగ మొక్కలను తప్పనిసరిగా నాటాలని సూచించారు. వివిధ పూల మొక్కలతో ఫ్లవర్ బెడ్స్ తయారు చేయాలని చెప్పారు. పిల్లలకు నాణ్యమైన బోధన అందించేందుకు వర్క్ షీట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. విద్యారంగంలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా చేపట్టిన పనుల్లో పురోగతి సాధించామని, ఇదే స్ఫూర్తితో మిగిలిన పాఠశాలల్లో కూడా పనులు పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫాం అందించేందుకు సహకరించిన ప్రధానోపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో సాంకేతిక సమస్యలను అర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ. నాగేశ్వర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎస్. సతీష్‌కుమార్, బాలికా విద్య కో ఆర్డినేటర్ కె. అన్నామణి, ప్రభుత్వ పరీక్షల కమిషనర్ ఎస్. మాధవరావు, సమగ్రశిక్ష ఫైనాన్స్ అధికారి ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు

అప్పటికప్పుడే ఆపన్నహస్తం

- పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడికి ఐటీడీఏ పీఓ చేయూత
- అంతర్జాతీయ పోటీలకు వెళ్తున్న గిరిజన క్రీడాకారుడికి పీఓ రాహుల్ భరోసా
- సత్వరమే స్పందించడంపై క్రీడావర్గాల్లో హర్షాతిరేకాలు

భద్రాచలం: ఆయనది మారుమూల ఏజెన్సీ గ్రామం.. చదువుకున్నది పదో తరగతి వరకే.. అయితేనేం పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించడం వెన్నతో పెట్టిన విద్య. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అనేక బహుమతులు సాధించిన ఆ గిరిజన క్రీడాకారుడికి సరైన సమయంలో చేయూతనందించారు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా వెళ్లలేని పరిస్థితి ఎదుర్కొంటున్న క్రీడాకారుడి గురించి తెలుసుకున్న పీఓ ఐటీడీఏ తరఫున ఆర్థిక సాయం అందించడానికి ముందుకొచ్చి మంచి మనసు చాటుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన తొలి గిరిజనుడికి అండగా నిలబడిన పీఓకు గిరిజనులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

కూలీ పనుల నుంచి పోటీలకు...
ప్రస్తుత ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడేనికి చెందిన మోడెం వంశీ పదో తరగతి వరకు మాత్రమే చదివాడు. తల్లిదండ్రులిద్దరూ కూలి పనులతో జీవనం సాగిస్తుండగా ఆర్థిక సమస్యలతో వంశీ చదువు ఆపేసి వారికి చేదోడుగా కూలీకి వెళ్లేవాడు. ఈ క్రమంలో 2016లో ఇబ్రహీంపట్నం గ్రామంలో నర్సరీ యజమాని అబ్దుల్ ఫరూఖ్ వద్ద పనికి చేరాడు. ఫరూఖ్ అప్పటికే భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతుండగా బరువు ఎత్తడంలో వంశీ ప్రతిభను గుర్తించి పవర్ లిఫ్టింగ్ గురించి వివరించాడు. దీంతో ఆయన ప్రయాణంలో మలుపు తిరిగింది. అక్కడే సాధన ఆరంభించి భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌లో కోచ్ రామిరెడ్డి సలహాలు, సూచనలకు తోడు కఠోర శ్రమతో పోటీలకు వెళ్లడం మొదలుపెట్టాడు. ఈ మేరకు 2021లో గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకంతో పాటు బెస్ట్ లిఫ్టర్ అవార్డు అందుకున్నాడు. ఆపై 2022లో కేరళ, హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి, సౌత్ ఇండియా స్థాయి పోటీలు, 2023లో ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలు, ఈ ఏడాది రాజస్థాన్, పంజాబ్‌లో జరిగిన పోటీల్లో పతకాలు సాధించాడు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బరువు ఎత్తుతున్న వంశీ (ఫైల్)

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక..
పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చాటుతున్న వంశీని గుర్తించిన పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసింది. పవర్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తొలి గిరిజనుడైన వంశీ 66 కేజీల విభాగం పోటీల్లో పాల్గొనాల్సి ఉండగా.. శిక్షణ, రవాణా, వీసా ఇతర ఖర్చులకు రూ.2.10 లక్షలు చెల్లించాలని నిర్వాహకులు సూచించారు. అంత స్థోమత లేని వంశీ.. చివరి తేదీ అయిన బుధవారమే జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, భద్రాచలానికి చెందిన జీ.వీ.రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివ రామకృష్ణ ప్రసాద్‌ను ఆశ్రయించాడు. వీరి సాయంతో ఐటీడీఏ పీఓ రాహుల్‌ను కలిసేందుకు వెళ్లగా విధినిర్వహణ నిమిత్తం ఆయన ఇతర ప్రాంతంలో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఫోన్‌లో సమాచారం ఇవ్వగా అక్కడి నుంచే క్రీడాకాధికారి, ఏపీఓ జనరల్ ఇతర అధికారులతో మాట్లాడి సోమవారం కొంత మేర ఆర్థిక సాయం అందించేందుకు హామీ ఇచ్చారు. దీంతో నిర్వాహకులు సైతం అంగీకరించారు. ఆర్థిక సాయంతో పాటు ఇతర శిక్షణకు సహకరిస్తానని హామీ ఇచ్చిన పీఓకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడు మోడెం వంశీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ పోటీలకు వెళ్లే ఆర్థిక స్థోమత తనకు లేదని, తన సమస్యను కృష్ణప్రసాద్, జీవి రామిరెడ్డికి చెప్పగా వారు ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లారని చెప్పాడు. వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చిన పీఓను ఎన్నటికీ మరవలేనన్నాడు. భద్రాచలం ఏజెన్సీ పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలిపేలా కృషి చేస్తానని చెప్పాడు.

క్లుప్తంగా

చంద్రుగొండలో ఆపరేషన్ ముస్కాన్

చంద్రుగొండ: మండల కేంద్రంలో బుధవారం ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. ముగ్గురు బాలకార్మికులను గుర్తించి వారితో పనిచేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు. యండీ సాధిక్‌పాషా, కె.హేమంత్, యండీ సమీర్‌పై సహాయ కార్మిక శాఖాధికారి షర్ఫుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ముస్కాన్ టీంలో కొత్తగూడెం వన్ టౌన్ ఎస్‌ఐ రవికుమార్, కానిస్టేబుళ్లు పూజిత, భిక్షమయ్య, కిషన్, సామాజిక కార్యకర్త భారతి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎస్‌ఐ మృతి


సీమనాయక్ (ఫైల్)

దమ్మపేట: దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న సీమనాయక్ (60) గుండెపోటుతో మృతి చెందారు. ఎస్‌ఐ సీమనాయక్ ఖమ్మంలోని తన నివాసంలో ఉన్న క్రమంలో బుధవారం తెల్లవారుజామున గుండెనొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్‌ఐ మృతి పట్ల తోటి సిబ్బంది, మండలంలోని పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామానికి చెందిన గొగ్గెల పెదగోవింద్ (40) పురుగులమందు తాగి బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొంతకాలంగా మద్యానికి బానిసైన గోవింద్ రోజూ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో గోవింద్‌కు, ఆయన భార్యకు మధ్య ఘర్షణ జరిగేది. మంగళవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన గోవింద్ ఇంట్లో నిల్వ ఉన్న పురుగులమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు ఆస్పత్రికి అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సురక్షా బస్టాండ్ ఏరియాకు చెందిన ఓ వ్యక్తి పురుగుమందు సేవించి.. డయల్ 100కు ఫోన్ చేశాడు. స్పందించిన పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించి కాపాడారు. స్థానికుల కథనం ప్రకారం.. జాఫర్ మనస్తాపంతో పురుగుల మందు తాగి 100కి డయల్ చేసి విషయం చెప్పి ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రసాద్ బాధితుడి ఫోన్ లోకేషన్ గుర్తించి, బ్లూకోల్ట్స్ సిబ్బంది పుల్లం దాస్, గోవింద్, కానిస్టేబుల్ కలిసి ఆస్పత్రికి తరలించి జాఫర్‌ను కాపాడారు.

మనీ లాండరింగ్ పేరుతో రూ.4 లక్షలు స్వాహా

పాల్వంచ: మనీ లాండరింగ్ కేసు పేరుతో సైబర్ నేరగాళ్లు నగదు స్వాహాకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పాత పాల్వంచ జెన్‌కో కాలనీకి చెందిన షేక్ వహీదు న్నీసాకు ఈ నెల 8వ తేదీన ఫోన్ వచ్చింది. తాము ముంబై పోలీసులమని తిలక్‌నగర్ శాఖ నుంచి అని చెప్పి.. మీపై మనీ లాండరింగ్ కేసు రూ.2.50 కోట్లకు నమోదైందని, కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కనెక్ట్ చేస్తున్నామంటూ చెప్పారు. ఈడీ రూ.2.50 కోట్ల మనీ లాండరింగ్ కేసును జూన్ 6న నమోదు చేసిందని, తాము చెప్పిన విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఖాతాలో రూ.4 లక్షలు జమచేస్తే కేసు పరిష్కారమవుతుందని సలహా ఇచ్చారు. దీంతో వారు సదరు ఖాతాకు రూ.4 లక్షలు పంపించారు. అనంతరం వారి ఫోన్ కలవక పోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

జూలూరుపాడు: జూలూరుపాడులోని సాయిబాబా ఆలయం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన నగేష్-పద్మ దంపతులు బైక్‌పై జూలూరుపాడు మండలం సురారంలో జరగనున్న కర్మ కార్యక్రమానికి బయలుదేరారు. జూలూరుపాడులో సాయిబాబా ఆలయం వద్ద వీరి బైక్‌ను కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈఘటనలో నగేష్, పద్మ గాయపడడంతో 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, కలెక్టరేట్ ఉద్యోగి తన భార్యను కారులో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

పేకాట స్థావరంపై దాడి

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామ శివారులోని పేకాట స్థావరంపై బుధవారం ఎస్‌ఐ రాజేశ్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.8,260 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

అంగన్‌వాడీలకూ 'విరమణ'!

65 ఏళ్లు దాటిన టీచర్లు, ఆయాల రిటైర్మెంట్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 29 మంది టీచర్లు, 137 మంది ఆయాల గుర్తింపు
- ఈ నెల నుంచే అమలు


అంగన్‌వాడీలో పిల్లలకు చదువుచెబుతున్న టీచర్

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలతోపాటు పలుమార్పులు చేర్పులకు శ్రీకారం చుడుతోంది. పాఠశాలల పరిధిలోని సెంటర్లలో ప్రీస్కూల్ విద్యను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు 65 ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆధార్ కార్డు ఆధారంగా..

జిల్లాలో మొత్తం 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పనిచేసే టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ సంబంధించి ప్రకటించిన ఉత్తర్వులను జూలై 1వ తేదీ నుంచి జిల్లాలో అమలు చేశారు. వీరికి అటెండెన్స్ నమోదు చేయడం గాని, వేతనం చెల్లించడం గాని నిలిపి వేయాలని సీడీపీఓలు, సూపర్‌వైజర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో 65 ఏళ్లు పైబడిన జిల్లా మొత్తం 29 మంది టీచర్లు, 137 మంది ఆయాలు ఉన్నారు. వారికి జీతాలు అందించే సమయంలో వారు అందించిన ఆధార్ కార్డుల ఆధారంగా వయస్సును లెక్కించి ప్రభుత్వానికి నివేదించారు.

పెరగనున్న ఖాళీలు?

జిల్లాలో ఐసీడీఎస్ పరిధిలో 11 ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2060 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 34,575 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 28,513 ఉన్నారు. 7,197 వేల మంది గర్భిణులు, 7,295 మంది బాలింతలున్నారు. వీరందరికీ ప్రతిరోజు ఆరోగ్యలక్ష్మి ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇప్పటికే ఖాళీలతో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. జిల్లాలో ఇప్పటికే టీచర్లు ఆయాల ఖాళీలు ఉన్నాయి. కొన్ని కేంద్రాల్లో టీచర్లు ఉంటే ఆయాలు లేరు. మరికొన్ని కేంద్రాల్లో టీచర్లు లేకుండా ఆయాలే సెంటర్లు నడుపుతున్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగ విరమణ ప్రకటిస్తే జిల్లాలో మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి. అయితే, వీరి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు మేలు చేకూరనుంది.

టీచర్లకు రూ.లక్ష.. ఆయాలకు రూ.50 వేలు

రిటైర్మెంట్ పొందుతున్న టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేల చొప్పున బెనిఫిట్స్ అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం వారికి బెనిఫిట్స్‌ను అందించనున్నారు. జూలై నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నెలకు రూ.150 జీతంతో..

ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న వారిలో చాలామంది టీచర్లు, ఆయాలకు మూడు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. అప్పట్లో కేవలం రూ.150 జీతంతో పలువురు అంగన్వాడీ టీచర్లుగా చేరారు. అరకొర వేతనాలతో మూడు నాలుగు దశాబ్దాలపాటు పనిచేశారు. ప్రస్తుతం టీచర్లకు నెలకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 వేతనం ఇస్తున్నారు. ఇన్నాళ్లూ వారికి తప్పనిసరి రిటైర్మెంట్ లేదు. శక్తి ఉన్నంత వరకు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగ విరమణ తప్పనిసరి చేసింది. 65 ఏళ్లు పూర్తి చేసుకున్న టీచర్లు, హెల్పర్లు తప్పకుండా రిటైరవ్వాలని ఆదేశించింది. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటించింది. దీనిపై వారు పెదవి విరుస్తున్నారు.

కేంద్రాల నిర్వహణ ప్రశ్నార్థకం..

టీచర్లు, హెల్పర్లు వెళ్లిపోవడంతో ఆయా కేంద్రాలను ఎవరు నిర్వహించాలన్న దానిపై స్పష్టత రావడం లేదు. ఇప్పటికే జిల్లాలో కొన్ని కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేరు. దీంతో టీచర్లే ఆయాలుగా వ్యవహరించగా, కొన్ని చోట్ల ఆయాలే టీచర్లుగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మరిన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఖాళీ స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో కేంద్రాల పరిధిలో సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



ప్రభుత్వం 65 ఏళ్లు ఉన్నవారిని రిటైర్మెంట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మా వద్ద ఉన్న ఆధారాలతో ప్రభుత్వానికి నివేదికను అందించాం. ఖాళీగా ఉండే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ఖాళీ అయిన వారి స్థానాల్లో కూడా కొత్త టీచర్లు, ఆయాలను రిక్రూట్ చేసే విధంగా ఇప్పటికే ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుంది. అంగన్‌వాడీల నిర్వహణలో ఎక్కడా కూడా లోపాలు లేకుండా బాధ్యత తీసుకుని, లబ్ధిదారులకు అన్ని సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం.

–వేల్పుల విజేత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై పోరాటం..

- ఇల్లెందులో పీవైఎల్ రాజకీయ శిక్షణా తరగతుల్లో వక్తలు
- సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ హాజరు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకులు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందుతున్నారని, రానున్న కాలంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువతతో కలిసి అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.అజయ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య స్పష్టం చేశారు. బుధవారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో పీవైఎల్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించారు. పీవైఎల్ జెండాను అజయ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానం ఇచ్చిందని గుర్తు చేశారు. గత నాలుగేళ్లలో 47 సార్లు పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని, తద్వారా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అమలు చేస్తున్న కేంద్రీకృత విద్యావిధానంలో అసమానతలు పెరిగిపోతున్నాయని, లీకేజీ మాఫియాను పెంచి పోషిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో డీఎస్సీ ప్రకటిస్తామని ఆరు నెలలైనా అడ్రస్ లేకుండా పోయిందన్నారు. మెగా డీఎస్సీ కాకుండా నామమాత్రపు పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగుల ఆశల మీద నీళ్లు చల్లిందన్నారు. తెలంగాణలో యువతను మద్యానికి, గంజాయికి బానిసలుగా మారుస్తోందని మండిపడ్డారు.

పీవైఎల్ జిల్లా నూతన కమిటీ..

ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ధరావత్ దేవా, ప్రధాన కార్యదర్శిగా కొర్సా రామకృష్ణతో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పృథ్వీ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, ఆర్ఎస్‌సీ బోసు, నూప భాస్కర్, అజ్మీర బిచ్చా, వాసం బుచ్చిరాజు, ఇస్లావత్ కోటేశ్, వై.సతీశ్, కుంజా అర్జున్ పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్

- వివాహేతర బంధానికి అడ్డువస్తున్నాడని భర్తను హత్య చేయించిన భార్య
- ప్రియుడితో కలిసి ప్రణాళిక
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రెహమాన్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను.. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో కలిసి భార్య హత్య చేసింది. ఈ ఘటన గౌతంపూర్‌లో చోటుచేసుకోగా.. పోలీసులు హతుడి భార్య, ప్రియుడు, సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. బుధవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేశ్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. కొన్నేళ్ల కిందట సాహు ఈశ్వర్, ఎండీ రెహానా ప్రేమ వివాహం చేసుకుని గౌతంపూర్‌లోని సింగరేణి క్వార్టర్లలో ఉంటున్నారు. సాహుఈశ్వర్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే సింగరేణి క్వార్టర్లలో ఉంటున్న అరికె రమేశ్‌తో ఎండీ రెహానాకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. విషయం తెలిసిన ఈశ్వర్.. రెహానాను మందలించాడు. అయినా వారి సంబంధం కొనసాగింది. చివరికి ఈశ్వర్.. అరికె రమేశ్‌ను సింగరేణి క్వార్టర్ ఖాళీ చేయించాడు. దీంతో రెహానా, రమేశ్ ఫోన్‌లో మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఇది గమనించిన ఈశ్వర్.. రెహానాను హెచ్చరించడంతో ఇక ఈశ్వర్ అడ్డు తొలగించుకోవాలని భావించింది. ఈ నెల 6 అరికె రమేశ్, అతడి అల్లుడు భట్టు చందు, అరికె ఇందిర కలిసి ఈశ్వర్ ఇంటికి వచ్చి కత్తితో విచక్షణా రహితంగా పొడిచారు. ఇంట్లోనే ఉన్న రెహానా వారికి అడ్డుచెప్పకుండా సహకరించింది. గమనించిన చుట్టుపక్కలవారు ఈశ్వర్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా మరుసటి రోజు మృతిచెందాడని డీఎస్పీ వివరించారు. ఈ కేసులో అరికె రమేశ్, ఎండీ రెహానా, భట్టు చందు, అరికె ఇందిరను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఆయన వెల్లడించారు. రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రెహమాన్ అభినందించారు.

ఉజ్వల గ్యాస్ సిలిండర్ల పంపిణీలో చేతివాటం?

పాల్వంచ: ఉజ్వల పథకం కింద వచ్చిన గ్యాస్ సిలిండర్ల పంపిణీలో కొందరు వ్యక్తులు చేతి వాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. పట్టణంలోని వెంకటేశ్వ హిల్స్ కాలనీకి బుధవారం సాయంత్రం ఉజ్వల పథకం కింద గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు వచ్చాయి. వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేసే క్రమంలో కొందరు నిర్వాహకులు సిలిండర్‌కు రూ.వెయ్యి చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా పంపిణీ కార్యక్రమాన్ని రాత్రి 10 గంటల వరకు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న డీటీసీఎస్ శ్రీనివాసరావు చేరుకోగా అప్పటికే వారు జారుకున్నట్లు సమాచారం. ఈ విషయమై డీటీసీఎస్‌ను వివరణ కోరగా తమకు సమాచారం వచ్చిందని, విచారణ చేస్తామని తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని ఒడ్డుగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనంలో గుట్కా ప్యాకెట్ల నిల్వలు ఉన్నట్లు సమాచారంతో ఎస్‌ఐ బి.రాము తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. రూ.10.80 లక్షల విలువ చేసే 45 బస్తాల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన బండారు భద్రయ్యపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాము తెలిపారు.

పోలీసునని చెప్పి రూ.1,500 చోరీ


సీసీ కెమెరాలో రికార్డయిన నకిలీ కానిస్టేబుల్

పాల్వంచరూరల్: పోలీస్ కానిస్టేబుల్‌నని చెప్పి ఓ వ్యాపారి వద్ద రూ.1,500 నగదు స్వాహా చేసిన ఘటన ఇది. మండలంలోని పెద్దమ్మ గుడి సమీపాన వ్యాపారి అప్పారావు వద్దకు మంగళవారం ఓ వ్యక్తి వచ్చి పోలీస్ కానిస్టేబుల్‌నని చెప్పాడు. ఈ ఆదివారం ఫంక్షన్ ఉందని, పెరుగు బకెట్లు నమ్మబలికాడు. ఆతర్వాత ఫోన్ చేసి తాను నలుగురు ముద్దాయిలను కోర్టుకు తీసుకెళ్లాలని, ఏటీఎం కార్డు పనిచేయడం లేదని చెబుతూ రూ..3 వేలు అడగగా వ్యాపారి రూ.1,500 ఫోన్ పే చేశాడు. మరో రూ.1,500 కావాలని అడగడంతో వ్యాపారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఈవిషయాన్ని దూరం నుంచి గమనించిన నకిలీ పోలీస్ పరారయ్యాడు. ఈ అంశంపై బుధవారం వివరాలు ఆరా తీయడంతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీ, ఫోన్‌పే నంబర్ ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు సీఐ వినయ్‌కుమార్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత


బాలుడు, తల్లిదండ్రులతో పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: హాస్టల్ నుంచి తప్పిపోయిన బాలుడిని తిరిగి తల్లిదండ్రులకు త్రీటౌన్ పోలీసులు బుధవారం అప్పగించారు. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని తెలంగాణ హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్న పాలబోయిన బాలకృష్ణ ఉదయం 6 గంటలకు హాస్టల్ నుంచి పారిపోయాడు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ ఆవరణలో పోలీసులకు కనిపించడంతో స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. పాల్వంచ రేగులగూడెం గ్రామానికి చెందిన పాపయ్య కుమారుడిగా గుర్తించగా వారిని పిలిపించి అప్పగించారు.

కేసు నమోదు

జూలూరుపాడు: మండలంలోని గంగారంతండాకు చెందిన కొర్రా రవిచందర్‌పై అదే గ్రామానికి చెందిన భూక్యా కిషన్ దాడికి పాల్పడగా బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. గంగారంతండాకు చెందిన కొర్రా రవిచందర్ అదే గ్రామానికి చెందిన భూక్యా కిషన్ జేసీబీతో పని చేయించాడు. జేసీబీకి సంబంధించిన డబ్బులు ఇచ్చినా మళ్లీ ఇవ్వాలని రవిచందర్‌ను కిషన్ అడిగాడు. ఈ క్రమంలో రవిచందర్‌తో కిషన్ గొడవపడటంతోపాటు దుర్భాషలాడి కత్తి విసిరాడు. రవిచందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

దూషించిన మహిళపై..

పాల్వంచ: దివ్యాంగురాలిని దూషించిన మహిళపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనివాసబంజర కాలనీకి చెందిన దివ్యాంగురాలు బత్తుల నాగమణి మంగళవారం తన స్థలంలో గోడ నిర్మించుకుంటుండగా వెనుక నివాసం ఉండే వేముల కుమారి అడ్డుకుంది. తీవ్రంగా దుర్భాషలాడింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్‌ఐ రాము కేసు నమోదు చేశారు.

యజమానిపై కేసు

ఇల్లెందు: పట్టణంలోని ఆంబజార్‌లో ఓ కూల్‌డ్రింక్ షాపులో 18 ఏళ్ల లోపు బాలుడిని పనికి పెట్టుకున్న యజమానిపై కేసు నమోదు చేశారు. బుధవారం ఇల్లెందు సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆంబజార్‌కు చెందిన నవల్ కిశోర్‌అగర్వాల్ తన కూల్ డ్రింక్ షాపులో స్టేషన్ బస్తీకి చెందిన బాలుడిని పనికి పెట్టుకున్నట్లు గ్రహించిన ముస్కాన్ టీం పట్టుకుందన్నారు. తనకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై కేసు

పాల్వంచ: టూవీలర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి ఓ మహిళ గాయపడటానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని నవభారత్ వద్ద జూన్ 16వ తేదీన దాట్ల నాగేశ్వరరావు, అతని తల్లి జయ కలిసి టూవీలర్‌పై వెళ్తుండగా వెనుక నుంచి టేకులపల్లి మండలం కోక్యాతండాకు చెందిన హరికృష్ణ తన ఆటోతో ఢీకొట్టాడు. దీంతో జయకు గాయాలయ్యాయి. ఆమె హైదరాబాద్‌లో చికిత్స తీసుకుని బుధవారం ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తి దాడిలో ఒకరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: మద్యం విషయంలో జరిగిన గొడవ కాస్తా కత్తితో దాడి చేసే వరకు వెళ్లింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దామతోటి తిరుపతయ్య, ముక్కగిరి కార్తీక్ మద్యం విషయంలో గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన కార్తీక్ ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి తిరుపతయ్యపై దాడికి పాల్పడగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పిన్ని దాసరి జగదీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్తంభం ఎక్కే పరీక్షలో ఒకరి విజయం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్ల ఎంపికకు నిర్వహించిన స్తంభం ఎక్కే పరీక్షలో ఒకరు సఫలమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఇద్దరు జూనియర్ లైన్‌మెన్ల (జేఎల్‌ఎం) ఎంపికకు బుధవారం ఖమ్మంలోని ఎస్ఈ కార్యాలయంలో పరీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాక స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించగా ఇద్దరిలో ఓ అభ్యర్థి మాత్రమే విజయం సాధించారు. ఈ వివరాలను ఎంపిక కమిటీ ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

క్లుప్తంగా...

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ద.మ.రైల్వే జీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దిల్ కుషా గెస్ట్‌హౌస్‌లో ఆయనతో భేటీ అయిన జీఎం.. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

మంత్రి సీతక్కతో భేటీ అనంతరం ఎన్జీవోల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంతో మహిళలు, చిన్నపిల్లల సంరక్షణ, సాధికారత, తదితర అంశాలపై కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలు స్వచ్ఛంద సంస్థలు ప్రకటించాయి. మహిళలు, చిన్నారుల సంరక్షణ సంబంధిత రంగాల్లో పనిచేస్తూ సామాజిక ఉద్యమాల్లో, సేవా కార్యక్రమాల్లో అనుభవమున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కతో భేటీ అనంతరం ప్రకటించారు. బుధవారం సచివాలయంలో మంత్రితో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి కాలిఫోర్నియాకి చెందిన మంజుల కృష్ణన్, అంకురం ఎన్జీవో ప్రతినిధులు ఎం.సుమిత్ర, విజయ సమావేశమై ఆయా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విమెన్ ప్రొటెక్షన్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న మహిళల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ మహిళల నైపుణ్యాన్ని పెంచి వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సీతక్క కోరారు.

రైల్‌రోకో కేసు విచారణ

సిటీ కోర్టులు: రైల్‌రోకో కేసు విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం హాజరయ్యారు. 2011లో తెలంగాణ ఉద్యమం సమయంలో మాజీ సీఎం, కేసీఆర్, ప్రొ.కోదండరాంచేపట్టిన రైల్‌రోకో కార్యక్రమంలో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ నాంపల్లి కోర్టులో కొనసాగుతోంది. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోగా, ప్రొ. కోదండరాంకు ఎలాంటి స్టే లేకపోవడంతో రూ.10 వేల పూచీకత్తు పెట్టాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసు ట్రయల్‌కు వస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన కోర్టుకు హాజరయ్యారు.

భూముల తాకట్టు మతిలేని చర్య



- పరిశ్రమలకు ఇచ్చే భూములు కుదువ పెడుతున్న రేవంత్ సర్కార్
- మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్.. రూ.100 కోట్ల కమీషన్
- 'సాక్షి'వార్త కథనాన్ని ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ ప్రభుత్వం.. నిధుల సమీకరణకు ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కేటీఆర్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'దినపత్రికలో 'పరిశ్రమల భూములు తాకట్టు'శీర్షికతో ఈనెల 6వ తేదీన ప్రచురితమైన వార్తా కథనం క్లిప్పింగ్‌ను ట్యాగ్ చేశారు. ప్రభుత్వం భూముల తనఖాకు మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి రు.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు సిద్ధమైందని, ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు లేక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని, అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య అని ఆందోళన వ్యక్తం చేశారు. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉందని, కొత్తగా పెట్టుబడులు రాక, ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయని పేర్కొన్నారు. 'ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి?'అని ప్రశ్నించారు.

బల్లిపడిన టిఫిన్లు... చిట్టెలుకలు తిరిగే చట్నీలు

- కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

సాక్షి, హైదరాబాద్: ఆనాటి కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ హాస్టళ్లలో పురుగుల అన్నం, నీళ్ల చారు అందిస్తే .. ఈనాటి కాంగ్రెస్ పాలనలో బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు ఇస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఎద్దేవా చేశారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అన్నారు. మొత్తానికి కాంగ్రెసోళ్లు వచ్చి పెద్ద మార్పే తెచ్చారు'అని 'ఎక్స్'వేదికగా ధ్వజమెత్తారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతం అయితే, నిన్న కోమటిపల్లి హాస్టల్లో ఉప్మాలో బల్లి పడి 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ హాస్టల్లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తారన్నారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని, అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడ అని ప్రశ్నించారు. అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే విద్యార్థులకు ఈ అవస్థ, అస్వస్థత అని కేటీఆర్ విమర్శించారు.

రాష్ట్ర ఖజానాకు 'కిక్కు'

- గత ఏడాదితో పోలిస్తే ఈ సారి తొలి రెండు నెలల్లో రూ.2,500 కోట్ల అధిక రాబడి
- అప్పులు గత ఏడాది కంటే రూ.2 వేల కోట్లు తక్కువే
- స్థిరమైన ఆదాయంతో ఆర్థిక శాఖకు కొంత మేర ఉపశమనం



సాక్షి, హైదరాబాద్: గత ఏడాదితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వ రాబడులు మెరుగయ్యాయని ఆర్థిక గణాంకాలు చెబుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్, మే నెలల ఆదాయ, వ్యయాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు సమర్పించిన వివరాల ప్రకారం గత ఏడాదితో పోలిస్తే తొలి రెండు నెలల్లో అప్పులు తగ్గగా, సొంత పన్ను రాబడులు పెరిగాయని అర్థమవుతోంది. వస్తుసేవల పన్ను (జీఎస్టీ), రిజిస్ట్రేషన్ల ఆదాయం, అమ్మకపు పన్ను, ఎక్సైజ్ ఆదాయం.. ఇలా ప్రతి పన్ను ఆదాయంలోనూ గత ఏడాది తొలి రెండు నెలలతో పోలిస్తే వృద్ధి కనిపించింది. మొత్తంమీద గత రెండు నెలల్లో ప్రభుత్వానికి రూ. 23,147.64 కోట్లు సమకూరాయి. అదే గత ఏడాది తొలి రెండు నెలల్లో 22,427.81 కోట్లు లభించాయి. అయితే, పన్ను రాబడుల విషయానికి వస్తే గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రూ.20,097.73 కోట్లు రాగా, ఈ ఏడాది తొలి రెండు నెలల్లో 22,419.13 కోట్లు వచ్చాయి. అంటే, గత ఏడాది కంటే పన్ను రాబడులు రూ.2,500 కోట్ల వరకు పెరిగాయన్న మాట. ఇక, అప్పులు కూడా గత ఏడాదితో పోలిస్తే రూ.2 వేల కోట్ల మేర తగ్గినా మొత్తం మీద రూ.వెయ్యి కోట్లకు పైగా రాబడులు సమకూరడం, ఆదాయం స్థిరంగా కొనసాగుతుండటంతో ఆర్థిక శాఖ కొంత మేర ఊపిరి పీల్చుకుంటోంది.

గత రెండేళ్లలో ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వ రాబడి గణాంకాలివి.. (రూ.కోట్లలో)

ఆదాయ వనరు	2023-24		2024-25	
	ఏప్రిల్-	మే	ఏప్రిల్-	మే
పన్ను రాబడులు	9,698.65	10,399.08	11,464.17	10,954.96
పన్నేతర రాబడులు	357.64	533.83	354.71	373.80
గ్రాంట్ ఇన్ఎయిడ్	----	1,438.61	----	----
అప్పులు	5,026.29	4,240.12	2,246.62	5,133.65

వీఆర్వోలను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోండి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మణ్‌లకు వీఆర్వో జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో)ను మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ వీఆర్వోల జేఏసీ కోరింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధి బృందం బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న తమను అశాస్త్రీయంగా ఇతర శాఖల్లోకి పంపి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా గత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించిందని ఆవేదన చెందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగులు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నుంచి భూముల పరిరక్షణలో నిమగ్నమై, దాడులకు గురై, ప్రభుత్వ సంక్షేమమే ధ్యేయంగా, నియమ నిబద్ధతతో కీలక భూమిక పోషించిన తమను తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రికి రాత్రే లాటరీ పద్ధతిలో ఉత్తర్వులు జారీ చేసి 24 గంటల్లో ఇతర శాఖల్లోకి బదిలీ చేశారని, ఖాళీలు లేని శాఖలకు పంపి అవమానించారని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌లను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్‌రావు, అదనపు సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేశ్, వైస్ చైర్మన్లు చింతల మురళి, ప్రతిభ, నేతలు తిరుపతి, యాదగిరి, శేఖర్ తదితరులున్నారు. తమ వినతి పట్ల జీవన్‌రెడ్డి, లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఉన్న 10,909 గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులను నియమించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు వెల్లడించారు.



జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వీఆర్వో జేఏసీ నేతలు

నేడు రాష్ట్రానికి కురియన్ కమిటీ

- గెలిచిన ఎంపీలు, ఓడిన అభ్యర్థులతో సమావేశం
- రేపు ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో భేటీ
- శనివారం క్షేత్రస్థాయికి..

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతల పనితీరును అంచనా వేసేందుకు హైకమాండ్ నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ కురియన్, రకీబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్‌లతో కూడిన ఈ బృందం గురువారం ఉదయం 10 గంటలకు గాంధీభవన్‌కు రానుంది. ముందుగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులతో భేటీ కానుంది. అనంతరం గెలిచిన ఎంపీలతో కమిటీ సమావేశమవుతుందని, శుక్రవారం లోక్‌సభ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తుందని సమాచారం. ఈ భేటీల్లో వచ్చిన సమాచారాన్ని బట్టి శనివారం క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీ నేతలతో మాట్లాడుతుందని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.



రాష్ట్రానికి వచ్చిన కురియన్ బృందానికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు హర్కర, నిరంజన్

వీధి కుక్కల నియంత్రణకు చర్యలేవి?

జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై తప్పుబట్టిన హైకోర్టు

- పిల్లలు చనిపోతున్నా చర్యల్లో నిర్లక్ష్యాన్ని సహించమని హెచ్చరిక
- నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కల నియంత్రణకు ఏం చేశారన్న గణాంకాలు కాదని, ఇకపై చిన్నారులపై దాడి, మరణాలు జరగకుండా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. ఓ పక్క చిన్నపిల్లలు చనిపోతుంటే స్టెరిలైజేషన్ చేశామంటూ లెక్కలు చెబుతున్నారంటూ జీహెచ్‌ఎంసీ అధికారుల తీరును తప్పుబట్టింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో స్టెరిలైజేషన్ సరే.. మరి మురికివాడల పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. విషాదకర ఘటనలు మురికివాడల్లోనే చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేసింది. ఇలాంటి ఘటనలపై పరిహారం అందజేసి చేతులు దులుపుకోకుండా, మానవీయ కోణంలో స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సి ఉందని స్పష్టం చేసింది. దీనిపై ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

ఆ దారుణ ఘటనపై కథనాలే సుమోటోగా..

జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. బిహార్ చెందిన వీరి కుటుంబం పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. అలాగే గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో పిటిషన్లకు దీన్ని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం, నిబంధనలు రూపొందించడం కాదు.. వాటిని కఠినంగా అమలు చేసే వ్యవస్థ ఉండాలని వ్యాఖ్యానించింది. పిల్లలు చనిపోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని తేల్చి చెప్పింది. ఏ ఒక్కరినీ వదిలే పరిస్థితి ఉండకూడదని చెప్పింది. కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

అది ఫేక్ నోటిఫికేషన్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ప్రకటనను నమ్మొద్దని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పష్టంచేశారు. ఆర్టీసీలో 3,035 పోస్టుల భర్తీకి ఇటీవల ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. ఆ భర్తీ ప్రక్రియను టీజీపీఎస్సీ, పోలీస్, మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డులు సంయుక్తంగా చేపట్టనున్నాయి. ఇప్పటివరకు ఆయా సంస్థలు షెడ్యూల్‌ను ప్రకటించలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఓ ఫేక్ నోటిఫికేషన్ వైరల్‌గా మారింది. ఈ పోస్టుల భర్తీకి ఆర్టీసీ చర్యలు చేపట్టిందని పేర్కొంటూ ఓ బోగస్ నోటిఫికేషన్‌ను సోషల్ మీడియాలో కొందరు వైరల్ చేశారు. అందులో ఉన్న లింకును క్లిక్ చేసి ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాలను నమోదు చేయాలని అందులో పేర్కొన్నారు. అయితే ఇది ఫేక్ నోటిఫికేషన్ అని, అభ్యర్థులెవరూ మోసపోవద్దని సజ్జనార్ తెలిపారు.

జిల్లా వార్తలు

13, 14 తేదీల్లో ఆదివాసీ పరివార్ సమావేశాలు

భద్రాచలంఅర్బన్: ఆదివాసీ తెగల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల 13, 14 తేదీల్లో భద్రాచలంలో ఆదివాసీ పరివార్ జాతీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ, ప్రోగ్రాం కన్వీనర్ గుండు శరత్ తెలిపారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం, ఐదు, ఆరో షెడ్యూళ్లలోని ప్రాంతాల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నాయని విమర్శించారు. ఈనేపథ్యాన సమస్యలపై చర్చించడంతో పాటు ఆదివాసీ సంఘాల జాతీయ నాయకత్వాన్ని ఒకే వేదిక పైకి తీసుకొచ్చేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, పోడు సమస్య, సంక్షేమ పథకాలు, ఐటీడీఏల పనితీరుపై చర్చించి సమస్యలపై ఉద్యమ ప్రణాళిక ప్రకటిస్తామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 12 ఏళ్ల జైలుశిక్ష



కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా కేసులో ఇద్దరికి 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు చెరో రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం టౌన్ పోలీసులు కూనవరం రోడ్డులో 2023 జూన్ 16న వాహనాల తనిఖీ చేపట్టగా మారుతీ వ్యాన్‌లో తరలిస్తున్న 242 గంజాయి పొడి ప్యాకెట్లు, ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయి పట్టుబడింది. మొత్తంగా రూ.96.80 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని భద్రాచలానికి చెందిన తాడి శివశంకర్, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బాపనపల్లికి చెందిన ఆజగర్ ఖాన్ అలియాస్ సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా విచారణలో నేరం రుజువు కావడంతో 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన త్రినాథ్, పాపారావు అలియాస్ పుష్పసింగ్, తాతారావు అలియాస్ రాజు, మడకం రాము, బాబ్జీ, ఢిల్లీకి చెందిన నంద, అభయ్ పరారీలో ఉన్నారని పోలీసు అధికారులు కోర్టుకు వివరించారు. కాగా, ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ వాదనలు వినిపించగా, సిబ్బంది ఎం.హరిగోపాల్, సుధీర్‌బాబు సహకరించారు.

ఈ జింకలను ఏం చేద్దాం?!

- కిన్నెరసాని డీర్ పార్క్‌లో సామర్థ్యానికి మించి సంతతి
- ఎక్కువగా ఉన్న వాటి అంశంపై తర్జనభర్జన
- ఒకేసారి అడవిలో వదిలితే జీవనంపై నీలినీడలు
- రేగళ్ల, చింతోనిచెలకలో తాత్కాలిక పార్క్‌ల ఏర్పాటుకు కసరత్తు



కిన్నెరసాని డీర్‌పార్క్‌లో జింకలు

పాల్వంచ రూరల్: చెంగుచెంగున గెంతుతూ వచ్చే జింకలు చూస్తే మనసుకు ఆహ్లాదంగా ఉంటుంది. మనం పెట్టే గడ్డి, కూరగాయలు ముక్కలను అవి తింటుంటే సరదాగా అనిపిస్తుంది. ఈ అనుభూతిని పాల్వంచ మండలం కిన్నెరసాని డీర్‌పార్క్‌కు వెళ్తే పొందొచ్చు. అయితే, ఇప్పుడు అవే జింకల సంతతి సామర్థ్యానికి మించి పెరగడం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్నేళ్ల క్రితం వాటికవే పోట్లాడుకుని కొమ్ములతో పొడుచుకున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే ఎక్కువ ఉన్న జీవాలను ఇతర చోటకు తరలించాలనే యోచనకు వచ్చారు. కానీ అటవీ ప్రాంతంలో వదిలేస్తే ఇన్నాళ్లు సిబ్బంది, పర్యాటకులు సమకూర్చే గడ్డి, కూరగాయలు తినడానికి అలవాటు పడడంతో స్వతహాగా ఆహారం సమకూర్చుకోగలవా అనే మీమాంస ఎదురవుతోంది. దీంతో మరో రెండు చోట్ల కంచెతో కూడిన పార్క్‌లను ఏర్పాటు చేసి జింకలను అక్కడ వదిలి సాధారణ పరిస్థితులకు అలవాటయ్యాక అటవీ ప్రాంతంలోకి పంపించాలని భావిస్తున్నారు.

49ఏళ్ల క్రితం ఏర్పాటు..

కిన్నెరసాని గ్రామపంచాయతీ పరిధిలో 1974లో డీర్ పార్క్ ఏర్పాటుచేశారు. అప్పట్లో మూడు జింకలను వదలగా.. వాటి సంతతి నానాటికీ పెరుగుతూ ఇప్పుడు 135కు చేరింది. ఇందులో ఆడజింకలు 54, మగ జింకలు 81 ఉన్నాయి. జింకల సంరక్షణ బాధ్యతను 1998 వరకు సింగరేణి సంస్థ పర్యవేక్షించగా.. 1999లో వన్యప్రాణుల సంరక్షణ విభాగానికి(వైల్డ్‌లైఫ్) అప్పగించింది. కాగా, 2012లో రూ.11లక్షల వ్యయంతో 720 మీటర్ల విస్తీర్ణం మేర ఇనుప కంచె నిర్మించారు.

పోషణకు అరకొర నిధులు

డీర్‌పార్క్‌లో జింకలకు ఆహారం కోసం ప్రత్యేకంగా రెండు హెక్టార్ల విస్తీర్ణంలో గడ్డి పెంచుతున్నారు. దీనికి తోడు కూరగాయల మొక్కలు కూడా ఉదయం, సాయంత్రం సిబ్బంది అందిస్తారు. అయితే, జింకల ఆహారానికి ప్రభుత్వం ద్వారా అరకొరగానే నిధులు వస్తుండడంతో వైల్డ్‌లైఫ్ సిబ్బంది అదే స్థాయిలో ఆహారాన్ని అందిస్తుండగా.. డీర్‌పార్క్‌కు వచ్చే పర్యాటకులు తినడానికి ఏమైనా పెట్టకపోతారా అని మూగజీవాలు ఆశగా ఎదురుచూస్తుంటాయి.




జింకల పార్క్ ముఖద్వారం

కొత్త పార్క్‌లు తప్పనిసరి

కిన్నెరసాని డీర్‌పార్కులో సామర్థ్యానికి మించి జింకలు పెరగడంతో వాటిని ఎక్కడికి తరలించాలి, ఏం చేయాలని వైల్డ్‌లైఫ్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. కంచెల మధ్య పెరిగిన వీటిని ఒకేసారి అటవీ ప్రాంతంలో వదిలేస్తే ఇబ్బందులు ఎదురై జీవనానికి ముప్పు ఏర్పడుతుంది. దీంతో మళ్లీ పార్క్‌లోనే వదిలేయాల్సి ఉంటుంది. దీంతో ప్రస్తుతం ఇక్కడ ఉన్న 135 జింకల్లో తొలిదశగా 50 జింకలను మరోచోటకు తరలించాలని నిర్ణయించారు. ఇందుకోసం రేగళ్ల, చింతోనిచెలక వద్ద అటవీ ప్రాంతాల్లో వంద ఎకరాల చొప్పున విస్తీర్ణంలో తాత్కాలిక పార్క్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ రెండు చోట్ల కంచెల ఏర్పాటు, గడ్డి పెంపకం తదితరాల కోసం రూ.50వేల నుంచి రూ.60వేల వరకు వెచ్చించేలా అనుమతి కోసం ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి అనుమతి రాగానే పార్క్‌లు ఏర్పాటు చేసి జింకలను తరలించడంతో పాటు కొన్నాళ్ల పర్యవేక్షించి అటవీ ప్రాంతంలో వదిలే అవకాశముందని సమాచారం.


జింకల సంరక్షణకు చర్యలు



కిన్నెరసాని పార్క్‌లో సామర్థ్యానికి మించి జింకలు పెరిగాయి. వీటి సంరక్షణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా లభించే ఆహారానికి అలవాటు పడేలా పర్యవేక్షిస్తున్నాం. దీంతో అడవిలో వదిలేసినా ఇబ్బంది ఉండదు.

– బాబు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

పార్క్‌కు.. ఆపై అడవిలోకి



డీర్‌పార్కులో జింకల సంతతి పెరిగిన అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడ ఉన్న 135 జింకల్లో 50 వరకు రెండు చోట్ల తాత్కాలిక పార్క్‌లకు తరలిస్తాం. ఆరు నెలలు అక్కడి వాతావరణానికి అలవాటయ్యాక అడవిలో వదిలివేయాలని నిర్ణయించాం.

– కృష్ణాగౌడ్, భద్రాద్రి జిల్లా అటవీశాఖాధికారి

టీచర్ల కోసం రోడ్డెక్కారు!



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు (ఇన్‌సెట్) పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్తుడు

- బడికి తాళం వేసి, రహదారిపై రాస్తారోకో
- డీఈఓ హామీతో ఆందోళన విరమణ

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులు తక్షణమే భర్తీ చేయాలనే డిమాండ్‌తో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వీరికి గ్రామస్తులు కూడా తోడయ్యారు. చివరకు డీఈఓ స్పందించి ఉపాధ్యాయుల నియామకంపై హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులు ఉండగా, పీజీ హెచ్‌ఎం, ఏడుగురు ఉపాధ్యాయులు ఉండాలి. ఇటీవల బదిలీల్లో ఐదుగురు వెళ్లగా, ఇద్దరు ఉపాధ్యాయులే మిగిలారు. వీరే ఇరవై రోజులుగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, గ్రామస్తులు బుధవారం ఉదయం విద్యార్థులు, ఉపాధ్యాయులను బయటకు పంపించి తాళం వేసి నిరసన తెలిపారు. అంతేకాక తెలంగాణ – ఏపీ ప్రధాన రహదారిపై చెక్‌పోస్టు వద్ద రెండు గంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి.

రెండు రోజుల్లో కేటాయింపు..

గుమ్మడవల్లిలో గ్రామస్తులు, విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలియడంతో డీఈఓ వెంకటేశ్వరాచారి స్పందించారు. పాఠశాల సమీపంలో ఉన్న సీఆర్‌పీ మాలోతు రామారావుకు ఫోన్ చేసి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. మరో మూడు రోజుల్లో పాఠశాలకు టీచర్లను కేటాయిస్తామని హామీ ఇవ్వగా స్థానికులు ఆందోళన విరమించారు.



మందు కొట్టేందుకు నీరు కరువు !

ఇల్లెందు మండలంలో 70 శాతానికి పైగా రైతులు వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. వరుణుడు కరుణిస్తేనే పంట ఇంటికి చేరుతుంది. అయితే, ఈ సీజన్‌లో అడపా, దడపా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న తదితర పంటలు వేయగా.. వాటికి చీడపీడలు ఆశిస్తున్నాయి. వీటి నివారణకు మందులు పిచికారీ చేసేందుకు కూడా సమీపంలో ఎక్కడా నీరు అందుబాటులో లేదు. దీంతో మండలంలోని పూబెల్లి గ్రామ రైతులు ఇలా చెరువుకు వెళ్లి ట్రాక్టర్ ద్వారా డ్రమ్ముల్లో నీరు తెచ్చుకుని పురుగుల మందు పిచికారీ చేస్తున్నారు. భారీ వర్షాలు పడితే చేను సమీపంలోని చిన్న చిన్న కాల్వలు, గుంతల్లో నీరు నిలుస్తుందని, ఆశించిన వర్షాలు లేక నీటికి ఇబ్బంది అవుతోందని రైతులు చెబుతున్నారు. – ఇల్లెందురూరల్

మెడికల్ బోర్డ్‌కు 174 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో బుధవారం మెడికల్ బోర్డ్‌లో భాగంగా ప్రీబోర్డ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న 204 మందిలో 174 మంది కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించగా, ఫలితాల ఆధారంగా గురువారం వైద్యనిపుణులు మరోమారు పరీక్షించి మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు అర్హులను నిర్ధారిస్తారు. కాగా, ప్రతీసారి మెడికల్ బోర్డ్‌లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో యాజమాన్యం ఇంటెలిజెన్స్ నిఘా ఏర్పాటు చేసింది. అయితే, ఈ నిఘా ఎంత మేరకు ఫలితాన్నిస్తుందో వేచిచూడాలి.



వైద్య పరీక్షలకు హాజరైన కార్మికులు